బీఈడీ అభ్యర్థులకు కౌన్సిలింగ్ ప్రారంభం

అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ఐటీడీఏ డీడీ మణెమ్మ

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబరు 13: ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ ప్రారంభించి ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్ పత్రాలు అందించామని ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలో మొత్తం 100 సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. అభ్యర్థులు జాయిన్ కాకపోతే ఆ సీట్లను ఈ నెల 17వ తేదీన మెరిట్‌లో ఉన్న అభ్యర్థులకు వెయిటింగ్ లిస్ట్ ద్వారా భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరూనాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబరు 13: తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కొనసాగుతున్న తమకు డైరెక్ట్ అపాయింట్‌మెంట్ మెరిట్ కమ్ రోస్టర్ సీనియార్టీ విధానం, పదోన్నతి తరువాత కాన్సిక్వేన్షియల్ సీనియారిటీ కొనసాగించాలని అన్నారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీవరకు డివిజనల్, సర్కిల్ ఆఫీసుల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నిరసన, 17న హన్మకొండ, 20న హైదరాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయల వద్ద నిరసన సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగారం చెక్‌డ్యాం నిర్మించాలి

కలెక్టర్‌తో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ/పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 13: నాగారం చెక్‌డ్యామ్ నిర్మించాలని, వరద బాధిత రైతులను ఆదుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను డీసీఎంఎస్ చైర్మన్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. ఐడీఓసీలో శుక్రవారం కలెక్టర్‌ను కొత్వాల కలిశారు. రైతాంగ సమస్యలను వివరించారు. ఉల్వనూరులో వరదలతో ఇళ్లు కోల్పోయిన 52 మందికి నష్ట పరిహారం ఇప్పించిన కలెక్టర్‌ను కృతజ్ఞతాపూర్వకంగా సన్మానించారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని ఉరితీయాలి

ఎస్సై విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంఘాల బాధ్యులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబరు 13: ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని ఉరితీయాలని భద్రాచలం ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి భద్రాచలం ఏఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఏఎస్పీకి, ఎస్సైలకు వినతిపత్రాలు ఇచ్చారు. ఆదివాసీ జేఏసీ నాయకులు కుంజా ధర్మ, పూనెం కృష్ణ, పాయం రవివర్మ, ముర్ల రమేష్, కారం పుల్ల య్య, కుంజా రమాదేవి, సోయం జోగారావు, జగ్గా పుల్లయ్య, శీలం దుర్గ, కణితి రాధ, తోకల దుర్గాప్రసాద్, సాధనపల్లి సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం

పర్ణశాల, సెప్టెంబర్ 13: స్వచ్ఛపక్వాడ కార్యక్రమంలో భాగంగా పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత' తదితర అంశాలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి 6వ తరగతి చదువుతున్న ధనలక్ష్మి, రెండోవ బహుమతి సాధించిన 6వ తరగతి చదువుతున్న సిద్దార్థకు హెచ్ఎం ప్రభాకర్ బహుమతులు అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

జ్వరాలతో జర జాగ్రత్త: ఐటీడీఏ పీవో

సారపాక: రోగులతో మాట్లాడుతున్న పీవో రాహుల్, బూర్గంపహాడ్: మ్యూజియం ఆవరణను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

సారపాక, సెప్టెంబర్ 13: వర్షాకాలంలో వచ్చే జ్వరాల(డెంగీ, మలేరియా, టైఫాయిడ్)తో ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో రాహుల్ కోరారు. బూర్గంపహాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రగ్ స్టోర్‌ను, ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులను పరామర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులతో, సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్య సేవలు అందించాలని, సమయ పాలన పాటించాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో కొత్తగా ప్రబలుతున్న తరుణ, సికిల్‌సెల్ వ్యాధులపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కుక్కకాటు, పాము కాటు సహా అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం, జీపీఎస్‌ను సందర్శించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అనారోగ్యం సోకితే వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించాలని ఉపాధ్యాయులతో చెప్పారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్లు అనిత, సబితారెడ్డి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ మ్యూజియంను సందర్శించిన ఐటీడీఏ పీవో

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబరు 13: భద్రాచలంలోని ట్రైబల్ మ్యూజియంను ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం సందర్శించారు. మ్యూజియం పరిసరాలను పరిశీలించి మ్యూజియం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మ్యూజియంలో పాతతరానికి సంబంధించిన వస్తువులకు సంబంధించి గిరిజనులు వాడిన వస్తువుల విధానం, పాతతరం వస్తువులను ఆయన పరిశీలించారు. మ్యూజియం వద్ద విదేశీ వ్యక్తులు, పర్యాటకులు వచ్చినప్పుడు వారికి దృశ్యకావ్యంలా ఉండేలా కళాకృతులు ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేత

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 13: మహాలక్ష్మి పథకం కింద మండలంలోని లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్ద అధికారులు శుక్రవారం గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. ఈ పత్రాల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులకు, రేషన్ షాపు డీలర్లకు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అవగాహన సమావేశాన్ని తహసీల్దార్ వివేక్ నిర్వహించారు.

ఇల్లెందు రూరల్‌లో..

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 13: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్యాస్ పథకం ప్రొసీడింగ్స్‌ను పంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ కోట రవికుమార్, ఎంపీడీవో ధన్‌సింగ్ అందజేశారు. వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని చెప్పారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, సెప్టెంబర్ 13: మండలంలో మహాలక్ష్మి లబ్ధిదారులు 7,146 మందికి గ్యాస్ ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు ఎంపీడీవో రవీంద్ర రావు తెలిపారు. టేకులపల్లి పంచాయతీలోని లబ్ధిదారులకు వీటిని శుక్రవారం అందజేశారు. మండలంలో మొత్తం 7,146 మందికి వారి ఇళ్ల వద్దనే ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు.

ఏఎన్ఎమ్‌కు సన్మానం

చండ్రుగొండ, సెప్టెంబర్ 13: బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎమ్ తేజావత్ సుశీలను మద్దుకూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో అశోక్ సన్మానించారు. పాఠశాల హెచ్ఎం భవాని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ దినేష్

టేకులపల్లి, సెప్టెంబర్ 13: మహాత్మా జ్యోతిబాపూలే బాయ్స్ హాస్టల్‌లో శుక్రవారం వైద్య శిబిరాన్ని సులానగర్ పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ నిర్వహించారు. హెచ్ఎం రవీందర్‌రావు, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, ఏఎన్ఎంలు సులోచన, చంద్రకళ, ధనసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 13: కౌమార విద్యపై ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపిక చేసిన 84 పాఠశాల్లో కౌమార విద్యను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. బాలబాలికల్లో శారీరక, మానసిక, ఉద్వేగపరమైన మార్పులు, హెచ్ఐవీ, ఎస్‌టీఐ సంక్రమిత వ్యాధుల నివారణ, జీవన నైపుణ్యాల పెంపు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, లైంగిక వేధింపులపై అవగాహన తదితరాంశాలు ఈ కౌమార విద్యలో ఉంటాయని వివరించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్, విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ నాగరాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, రిసోర్స్ పర్సన్స్ చంద్రశేఖర్, సునందిని, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

మాట్లాడుతున్న సీతారామయ్య

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 13: సింగరేణిలోని 30వేల మంది కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, సింగరేణి లాభాల బోనస్ చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జె.సీతారామయ్య, రీజియన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైటర్ బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పాత్ర ఉందన్నారు. వీరికి వేతనాలు, బోనస్ చెల్లించాలన్న డిమాండుతో ఈ నెల 30న 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు తోడేటి నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీను, సారంగపాణి, ప్రసాద్, ఆలీముద్దీన్, రావూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్' సమస్యలకు త్వరలో పరిష్కారం

ఇల్లెందు రూరల్: మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకులు

ఇల్లెందు రూరల్/పాల్వంచ, సెప్టెంబర్ 13: ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండుతో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబును ఆయన కార్యాలయంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, యాకూబ్ షావలి కలిశారు. ఆయన సమక్షంలో కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, వేతన బకాయిల చెల్లింపునకు ఈ చర్చల్లో సానుకూలత వ్యక్తమైంది. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని నాయకులకు డీసీహెచ్ డాక్టర్ రవిబాబు హామీ ఇచ్చారు. నాయకులు సతీష్, గోనెల రమేష్, కాంట్రాక్టర్ గుణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మరణం.. కొనసాగాలి 'రణం'..!

ఇల్లెందు రూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, దుమ్ముగూడెంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్.. సారపాకలో సీపీఎం నాయకులు

కొందరుంటారు.. వారు తమ కోసం కాకుండా పరుల కోసం తమ జీవితాన్ని అంకితం చేస్తుంటారు. వారికి కొన్ని ఆశయాలు, లక్ష్యాలు ఉంటాయి. వాటిని చేరుకునేందుకు ఉద్యమ నాయకులుగా మారుతారు.. ఉద్యమకారులను సృష్టిస్తారు.. ఉద్యమాలు నిర్మిస్తారు. అలాంటి (వామపక్ష) ఉద్యమకారుల్లో అగ్రగణ్యుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి. వామపక్ష శ్రేణులకు స్ఫూర్తిగా నిలిచిన, ప్రశ్నించే గొంతుకలకు ఊతమిచ్చిన, ప్రజాపోరాటాలను నడిపించిన, మతోన్మాద శక్తులకు దడ పుట్టించిన ఆ ఉద్యమ తార.. భౌతికంగా అనంతాకాశంలో కలిసిపోనుంది (ఆయన భౌతికకాయం ప్రస్తుతం ఢిల్లీలోని 'ఎయిమ్స్' ఆస్పత్రిలో ఉంది. వైద్య విద్యార్థుల బోధన-పరిశోధన కోసం కుటుంబీకులు దానం చేశారు). ''కామ్రేడ్ మరణం.. కొనసాగాలి రణం (ఉద్యమం). ఉద్యమకారుడికి నివాళి అర్పించడమంటే.. ఆయన సాగించిన ఉద్యమాన్ని ముందుకు.. మరింత ముందుకు.. మహోధృతంగా కొనసాగించడమే''నంటూ కామ్రేడ్ ఏచూరికి వామపక్ష శ్రేణులు నివాళులర్పించాయి.

- నమస్తే నెట్‌వర్క్

ఈ గణపతి.. కరోడ్‌పతి..!

పాల్వంచ: లక్ష్మీగణపతి అలంకరణలో స్వామివారు

పాల్వంచ, సెప్టెంబర్ 13: పాల్వంచలోని అంబేద్కర్ కూడలిలో కాపు సంఘం ఆధ్వర్యంలోని మంటపంలో గణపతి.. 'కరోడ్‌పతి'గా మారాడు..! నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం రూ.1.10 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో స్వామి వారిని నిర్వాహకులు అలంకరించారు. ఈ 'కరోడ్‌పతి' గణపతిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు, అలంకరణను ఆసక్తిగా తిలకించారు.

లక్ష్మీదేవిపల్లిలో..

లక్ష్మీదేవిపపల్లిలో..

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 13: మండలంలోని సంజయ్‌నగర్ పంచాయతీ మంటపంలో కొలువుదీరిన శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామిని నిర్వాహకులు శుక్రవారం రూ.3 లక్షల విలువైన కరన్సీ నోట్లతో 'లక్ష్మీ గణపతి'గా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. అలంకరణను భక్తులుఆసక్తిగా తిలకించారు.

పర్ణశాలలో..

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పర్ణశాల, సెప్టెంబర్ 13: మండలంలోని చిన్నబండిరేవు గ్రామంలో వినాయక మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ శుక్రవారం పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువ కప్పి సత్కరించారు. మాజీ జడ్పీటీసీ తెల్లం సీతక్క, సుధాకర్, ఆలయ కమిటీ సభ్యుడు రాము పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబరు 13: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామి వారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

పరిమితికి మించి వైద్యం చేయవద్దు

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 13: ఆర్ఎంపీలు, పీఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక హెచ్చరించారు. ఆమె శుక్రవారం వారితో తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంపీవో షబ్నా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హిందీ దివస్

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 13: జాతీయ హిందీ భాషా దినోత్సవం.. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ బాలుల ఉన్నత పాఠశాలలో జరిగింది. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.హరిత, హిందీ ఉపాధ్యాయులు ఎస్‌కె.సాజిద, డి.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు నర్సింహారావు, కట్టా శ్రీనివాసరావు, ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది గూండా సర్కార్

అశ్వారావుపేట, సెప్టెంబర్ 13: రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గూండా సర్కార్- గూండా పాలన సాగుతున్నదని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై ఆరికెపూడి గాంధీ సమక్షంలో ఆయన అనుచరులు దాడి చేయడాన్ని ఒక ప్రకటనలో ఖండించారు. నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రి హరీష్‌రావును కూడా అరెస్ట్ చేయడాన్ని తప్పుబట్టారు.

చండ్రుగొండలో..

చండ్రుగొండ, సెప్టెంబర్ 13: తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు కొణకండ్ల వెంకటరెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం చండ్రుగొండలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండించారు.

1098పై అవగాహన ఉండాలి

టేకులపల్లి, సెప్టెంబర్ 13: ప్రస్తుత కాలంలో బాలికలకు 1098 టోల్‌ఫ్రీ నంబర్‌పై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ రాజు, సారిక అన్నారు. మండలంలోని బద్దుతండాలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా తదితర విపత్కర పరిస్థితులలో బాలికలు వెంటనే 1098 నంబర్‌కు కాల్ చేయడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 13: 33/11 కేవీ సివిల్ లైన్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణం-మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాము ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణపురం, ఇల్లందులపాడు, రైటర్ బస్తీ, బొల్లి నగర్, 21 పిట్ ఏరియా, 21 ఏరియా, సబ్ జైలు ఏరియా, రాజీవ్‌నగర్ ఏరియా, కొత్త బస్టాండ్ ఏరియా, ఎన్‌జీవోస్ కాలనీ, ఎల్ బీఎస్ నగర్, ఎల్లన్న గ్రౌండ్, బుగ్గవాగు మిల్ ఏరియాలో ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు టేకులపల్లిలో..

టేకులపల్లి, సెప్టెంబర్ 13: మండలంలోని బొమ్మనపల్లి, కోయగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9.00 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బుజ్జి కన్నయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు చుంచుపల్లిలో..

చుంచుపల్లి, సెప్టెంబర్ 13: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్, నందాతండా, హౌసింగ్ బోర్డు, రాందాస్ తండా, చుంచుపల్లి తండా, ఎన్‌కే నగర్, బదావత్ తండా, బాబూ క్యాంప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు దివ్యాంగులకు బస్ పాస్‌లు

టేకులపల్లి, సెప్టెంబర్ 13: నేడు కోయగూడెం, చుట్టుపక్కల గ్రామాల్లోని దివ్యాంగులకు బస్ పాస్‌లను జశనివారం కోయగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఇవ్వనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేంద్రగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, ఒక ఫొటో, ఆన్‌లన్ చార్జీల కోసం రూ.50 తీసుకురావాలని వివరించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ మృతి

పినపాక (కరకగూడెం), సెప్టెంబర్ 13: కరకగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ ఈసంపల్లి నాగయ్య (46) తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో శుక్రవారం మృతిచెందాడు. విద్యుత్ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేట, సెప్టెంబర్ 13: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ సమీపంలో పెదవాగు ప్రాజెక్టు నుంచి శుక్రవారం ఉదయం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఫారెస్ట్ రేంజర్ మురళి, ఫారెస్టర్ సంపత్‌కుమార్, స్టెకింగ్ ఫోర్స్ కలిసి ఊట్లపల్లి వద్ద పట్టుకున్నారు. వాటిని స్థానిక అటవీ కార్యాలయానికి తరలించారు. డ్రైవర్లు బత్తుల పుల్లయ్యపై, రాకేష్‌పై కేసు నమోదు చేశారు.

18న ఇంటర్వ్యూలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 13: భద్రాది కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్, గౌరవ వేతన ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 18న కలెక్టరేట్‌లో వాక్-ఇన్- ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయని వివరించారు.

క్రీడాపోటీలు ప్రారంభం

రామవరం, సెప్టెంబర్ 13: సింగరేణ డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ స్పోర్ట్స్‌లో భాగంగా ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం ఏరియా ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి ప్రారంభించారు. కార్మిక నాయకులు మల్లికార్జున్‌రావు (ఏఐటీయూసీ), రజాక్ (ఐఎన్‌టీయూసీ), సీఎంవో ఏఐ ప్రతినిధి ఉపేంద్రబాబు, డీజీఎం శివకేశవరావు, డీవైపీఎం శ్రవణ్‌కుమార్, డీజీఎం యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ నిర్వాహకులపై కేసు

అశ్వారావుపేట, సెప్టెంబర్ 13: గణేష్ ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు చేయించిన కొందరు నిర్వాహకులపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో గురువారం రాత్రి గణేష్ ఉత్సవాల్లో యువతులు అశ్లీల నృత్యాలు చేస్తుండగా ఎస్సై శివరామకృష్ణ, సిబ్బంది అడ్డుకున్నారు. ఈ నృత్యాలు చేయించిన వెంకన్నబాబు, రాంబాబు తదితరులపై ఎస్సై కేసు నమోదు చేశారు.